క్లుప్తంగా

పక్కాగా రెవెన్యూ సదస్సుల రికార్డుల నిర్వహణ



రెవెన్యూ సదస్సు నిర్వహణ రికార్డులు పరిశీలిస్తున్న సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ త్రిపాఠి

మునగపాక: రెవెన్యూ సదస్సులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మనీషా త్రిపాఠి కోరారు. మండలంలోని పాటిపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె సందర్శించారు. సదస్సుల ద్వారా వచ్చే అర్జీలకు సంబంధించి ప్రతి విషయం రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారునికి సమాధానం చెప్పాలన్నారు. రికార్డుల నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆది మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత అవసరం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): పారిశుధ్యం, తాగునీటి పైపుల నిర్వహణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. అచ్యుతాపురం ఎస్‌టీబీఎల్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై బహిర్భూమికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో రోగాలు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.

అందుబాటులో యూరియా



వాడ్రాపల్లిలో అన్‌లోడ్ చేస్తున్న యూరియా

మునగపాక: సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులను ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచామని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. శుక్రవారం రైతులకు సరఫరా చేసే యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులను పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఆర్‌బీకే అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తులసీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో మరమ్మతుకు గురైన మంచినీటి బోరును శుక్రవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే తాగునీటి సమస్య ఎక్కడ వచ్చినా తక్షణం స్పందిస్తున్నామన్నారు.

ఉప్పవరంలో ఉచిత పశువైద్య శిబిరం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం ఉప్పవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి అచ్యుతాపురం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ సునీల్‌కుమార్ సేవలందించారు. ఈ శిబిరంలో 32 పశువులకు గర్భకోశ చికిత్సలు, 16 ఎదకు రాని పశువులకు పరీక్షలు నిర్వహించారు. పాడి పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందజేశారు. దూడల్లో మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, జగదీష్, జగదీష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- అలంకారప్రాయంగా యలమంచిలి వెజ్ మార్కెట్
- దయనీయంగా మారిన పరిసరాలు
- వీధుల్లో తిరిగే వ్యాపారులే వినియోగదారులకు దిక్కు



రైతుబజార్‌లో శిథిలమైన దుకాణాలు



పట్టణంలోని గాంధీనగర్‌లో అలంకారప్రాయంగా మారిన రైతుబజార్

రైతు బేజార్!



యలమంచిలి రూరల్: ఆరుగాలం శ్రమించి రైతన్న పండించిన ఉత్పత్తులను మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకునేందుకు వీలుగా పట్టణంలో ఏర్పాటు చేసిన రైతుబజార్(వెజ్ మార్కెట్) పరిస్థితి దయనీయంగా మారింది. అటు రైతులు, ఇటు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండాలన్న లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికి వదిలేయడంతో అధ్వానంగా తయారైంది. పట్టణం విస్తరిస్తున్నా రైతుబజార్ల ఏర్పాటుపై చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కొత్తవి ఏర్పాటు చేయకపోగా ఉన్న ఒక్క రైతుబజార్‌ను వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలంతా వ్యాపారులు, దళారులు నిర్ణయించిన ధరలకే కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. పట్టణంలోని గాంధీనగరం వీధి ఎంపీడీవో కార్యాలయం పక్కన 2011 నవంబరు 14న అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి రైతుబజార్‌ను నిర్మించారు. దిమిలి రోడ్డులో ఎప్పట్నుంచో ఉన్న కూరగాయల మార్కెట్ పాత బడిపోవడం, ఇరుకుగా ఉండటంతో ముందుచూపుతో రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. రైతులు సాగు చేసి పండించిన కూరగాయలు, ఆకుకూరలను నేరుగా రైతుబజార్‌కు తీసుకొచ్చి తనకు గిట్టుబాటైన ధరకు అమ్ముకోవచ్చు. దీంతో ఇటు రైతులకు, అటు వినియోగదారులకు మధ్య దళారీ వ్యవస్థకు అవకాశం ఉండదు. ఫలితంగా సరసమైన ధరలకు కూరగాయలు రైతుబజార్‌లో లభిస్తాయని భావించారు. అయితే ఇదంతా కొద్ది నెలలు మాత్రమే అమలైంది. రైతుబజార్‌లో కూడా స్థానిక వ్యాపారులే అమ్మకాలు జరుపుతూ క్రమంగా రైతుబజార్‌ను నిర్వీర్యం చేశారు. మళ్లీ పాత వెజిటబుల్ మార్కెట్‌లోనే కూరగాయల క్రయ, విక్రయాలు జరిగేలా దళారులు, మధ్యవర్తులు చేయగలిగారు. దీంతో క్రమంగా గాంధీనగరంలో నిర్మించిన రైతుబజార్ వృథాగా మారింది. కొంత కాలానికి అన్ని కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోవడంతో రైతుబజార్ అలంకారప్రాయంగా ఉండిపోయింది.

శిథిలమైన షెడ్లు

నిరుపయోగం కావడం, నిర్వహణ లేకపోవడంతో రైతుబజార్‌లో షెడ్లు శిథిలమయ్యాయి. గోడలు బీటలుపడి, పైకప్పులు విరిగిపోయాయి. ఆవరణం తుప్పలతో నిండిపోయింది. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లలో నివసించే వారంతా చెత్తా చెదారాలను రైతుబజార్‌లో పడేస్తున్నారు. దీంతో ప్రస్తుతం అక్కడ పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. మరోవైపు ఎవరూ పర్యవేక్షించకపోవడంతో రైతుబజార్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. దీనికి తోడు రాత్రి సమయాల్లో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం క్రమంగా విస్తరించడంతో పాటు, జనాభా కూడా పెరిగిందని, కానీ అవసరాలకు అనుగుణంగా కూరగాయల వ్యాపారాలు అందుబాటులోకి రాలేదని పలువురు సీనియర్ సిటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

వీధుల్లోనే వ్యాపారాలు.. దళారుల దోపిడీ

రైతుబజార్‌ను నిర్లక్ష్యం చేయడంతో వీధులు, ప్రధాన రహదారి పక్కన పాదచారులు నడిచి వెళ్లే దారుల్లోనే పలువురు కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారికిరువైపులా ఫుట్‌పాత్‌లను వీధి వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. మరోవైపు రైతుబజార్ లేకపోవడంతో దళారుల హవా కొనసాగుతోందని రైతులు మదనపడుతున్నారు. ముఖ్యంగా వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి రైతులు గంపలు, బస్తాలతో తెస్తున్న కూరగాయలను తాము నిర్ణయించిన ధరలకే అమ్మేలా పరిస్థితులను సృష్టిస్తున్నారు. దీంతో కష్టపడి సాగు చేసినప్పటికీ గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలి



శిథిలమైన రైతుబజార్‌ను తిరిగి వినియోగంలోకి తేవాలి. పట్టణ జనాభా గతం కంటే పెరిగింది. ప్రత్యేకంగా గాంధీనగరం ఏరియాలో అపార్టుమెంట్లు ఉన్నాయి. వాటిలో నివసించే కుటుంబాల అవసరాలకు సరిపడా దగ్గర్లో రైతుబజార్ ఉంటే ఎంతో ప్రయోజనం. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతుబజార్‌ను ఆధునీకీకరించాలి.

– మొండేటి రాంబాబు, గాంధీనగరం, యలమంచిలి

మార్కెట్లో అంతా దళారీల రాజ్యమే..



ప్రస్తుతం దిమిలి రోడ్డు కూడలి వద్ద ఉన్న కూరగాయల మార్కెట్లో అంతా దళారీల రాజ్యమే నడుస్తోంది. వ్యాపారులు, మధ్యవర్తులు చెప్పిన ధరకే వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయాలి. రైతులకు కూడా కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదు. రైతుబజార్ ఏర్పాటు చేస్తే అందరికీ మేలు జరుగుతుంది. ప్రభుత్వం ధరల పెరుగుదల సమయంలో ఇచ్చే సబ్సిడీ అందరికీ అందుతుంది.

– కె.అప్పారావు, దిమిలి రోడ్డు కూడలి, యలమంచిలి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



గతంలో నిర్మించిన వెజ్ మార్కెట్‌ను పరిశీలించి ఏం చేయాలనేది నిర్ణయిస్తాం. రైతుబజార్ పరిస్థితిపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించేలా చూస్తాం. రైతుబజార్ ఉంటే రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుంది. వీధుల్లో వ్యాపారాలు చేసేవారికి కూడా సౌలభ్యంగా ఉంటుంది.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

సామరస్యతతోనే సమస్యల పరిష్కారం



బంగారమ్మపాలెంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో ఎస్ఏవోబీ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. గ్రామంలో ఎస్ఏవోబీ నిర్మాణ ప్రాంతాన్ని శుక్రవారం రాత్రి ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు సమస్య వస్తే సామరస్యంగా మాట్లాడుకుని ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిగతా సమస్యలు కూడా అధికారులతో గ్రామ పెద్దలు చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోలీసులు తరచూ గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూడాలన్నారు. లైసెన్స్ లేని యువకులకు బైకు, ఇతర పెద్ద వాహనాలు ఇవ్వకూడదన్నారు. ఈ పర్యటనలో అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ ఆచార్యులు ఈ మెటీరియల్‌ను అందజేశారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీఎల్ కుమారి, ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

భూముల హేతుబద్ధీకరణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు

మునగపాక: భూముల హేతుబద్ధీకరణపై దృష్టి సారించాలని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భూముల ధరలకు సంబంధించిన వ్యత్యాసాలపై వివరాలు సేకరించాలన్నారు. ఎంత విస్తీర్ణం మేర ఏయే పంటల సాగు జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. లే-అవుట్ల పరిస్థితులు, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములకు సంబంధించిన వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. అలాగే పర్యాటక ప్రాంతాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.ఆది మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో హరిపురం జంక్షన్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి వారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, తమలపాకులతో భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద కోలాటం, సాము గరిడీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీగా బాణసంచా కాల్చారు.

రీసర్వేలో లోపాల సవరణకు అవకాశం



పాటిపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆది మహేశ్వరరావు



తిమ్మాపురం రెవెన్యూ గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

మునగపాక: రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పాటిపల్లిలో శుక్రవారం రీసర్వేకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలోని లోపాలను సవరించడంతో పాటు రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఆడారి గోవింద, మొల్లేటి సత్యనారాయణ, సబ్బి శ్రీనివాసరావు, ఆడారి జానకి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

ఎస్.రాయవరం: రీ సర్వేతో భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రమేష్‌బాబు అన్నారు. తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. సాగుదారులను గుర్తించి, వారి పట్టాదారు పుస్తకాల సర్వే నంబర్లు సరి చేసుకునే అవకాశం ఉంటుందని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మండల సర్వేయర్ త్రిమూర్తి, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నారాయుడుపాలెంలో ఆక్రమణలపై ఫిర్యాదు



తహసీల్దార్ ఆది మహేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మునగపాక: మండలంలోని నారాయుడుపాలెంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. నారాయుడుపాలెం గ్రామం మధ్యలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిలో పాఠశాల భవనం, అంగన్‌వాడీ భవనం, పాల డెయిరీ భవనాలు నిర్మించుకున్నామన్నారు. మిగతా భూమిలో కమ్యూనిటీ హాల్, కల్యాణ మండపం, రైతు భరోసా కేంద్రాలు, సబ్ సెంటర్ వంటి భవనాలు నిర్మించుకునేందుకు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ఖాళీగా ఉన్న ఈ స్థలంలో కొంతమంది పశువులను కడుతూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రశ్నించిన వారిపై దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ ఆది మహేశ్వరరావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎస్‌వీ సింహాచలం, కాకర అప్పారావు, లక్ష్మి, యర్ర అప్పలనరస, పోతురాజు, కర్రి శ్రీను, నూక తాతారావు తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన వచ్చింది. అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. పోటీలను ఏఎస్ఐ మన్మథరావు పర్యవేక్షించారు.

జాతీయ సమైక్యతకు హిందీ దోహదం



జాతీయ హిందీ సాహిత్య వెబినార్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్: జాతీయ సమైక్యతకు హిందీ దోహదం చేస్తుందని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఆలవాలమైన విశాల భారత దేశంలో అందర్నీ ఐక్యంగా ఉంచడానికి హిందీ భాష ఎంతో ఉపయోగపడుతోందని అభిప్రాయపడ్డారు. హిందీ భాషా సాహిత్యాలు-వివిధ దృక్పథాలు అనే అంశంపై శుక్రవారం జరిగిన జాతీయ వెబినార్‌ను ఆయన ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ మౌలానా ఆజాద్ ఎడ్యుకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వాతి జూజు, ఉత్తరాఖండ్ రుద్రపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ వసుధా ఉపాధ్యాయ, రాజస్థాన్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాశర్మ హిందీ సాహిత్యంలోని ప్రత్యేకత, ప్రాముఖ్యతను వెబినార్‌లో వివరించారు. కళాశాల హిందీ విభాగం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కె సుధ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, పశు వైద్య సిబ్బంది

కోటవురట్ల: అఖిల భారత పశుగణనకు రైతులు సహకరించాలని పశు వైద్యాధికారి డాక్టరు పి.హరిప్రియ కోరారు. జాతీయ పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసి ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ పశుగణనతోనే ప్రణాళిక ద్వారా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందని, రైతులు విధిగా మూగ జీవాల వివరాలు నమోదు చేయించాలన్నారు. పశుగణనకు ముగ్గురు వైద్యులు పర్యవేక్షకులుగాను, 10 మంది సిబ్బంది గణన చేస్తారని తెలిపారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు, కుక్కలను లెక్కిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏపీవో నాగరాజు, ఈవోపీఆర్డీ భానోజీరావు, సర్పంచ్ బి.అనిల్ కుమార్, ఎంపీటీసీలు పి.సూర్యారావు, వి.రాంబాబు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో సోమిదేవపల్లి గ్రామానికి శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు చర్యలు

నక్కపల్లి: త్వరలో జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు చేయించుకోవాలని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోడపు వెంకటరమణ, ప్రగడ శివాజీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓటర్ల నమోదు పత్రాలు అందజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. త్వరలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుందని, ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

బాలలను పనిలో చేర్చుకుంటే చర్యలు



నక్కపల్లిలో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

నక్కపల్లి: బాలలను పని చేర్చుకుంటే చర్యలు తప్పవని కార్మికశాఖ సహాయాధికారి(యలమంచిలి) ఎస్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం నక్కపల్లిలో పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో బాల, బాలికలు ఎవరైనా పని చేస్తున్నారా? అనే విషయాన్ని ఆరా తీశారు. బాల కార్మికులను ప్రోత్సహించడం, వారికి పనులు పురమాయించడం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పనుల్లోకి పంపిస్తే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వం బాల, బాలికలకు ఉచిత నిర్బంధ విద్య అందిస్తోందన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ తనిఖీల్లో కార్మిక శాఖ సిబ్బంది లోవరాజు, బాలల సంరక్షణ ప్రతినిధి అమ్మాజీ, సోషల్ వర్కర్ చిన్నారావు, సీడ్ ఆర్గనైజేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అభిజిత్ కంపెనీ కార్మికుల రాస్తారోకో



అచ్యుతాపురంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీని తక్షణమే తెరిపించాలని కోరుతూ శుక్రవారం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులతో సంప్రదించకుండా కంపెనీ యాజమాన్యం లే-ఆఫ్‌ను ప్రకటించడం అన్యాయమన్నారు.

కంపెనీని మూసేయడంతో వేలాది కార్మికులు వీధిన పడాల్సి వచ్చిందన్నారు. గత 12 రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. తక్షణమే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, కంపెనీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ గుడ్లు పక్కదారి



గుడ్లు పట్టుకుపోతున్న మహిళను మందలిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు గుడ్లను ఇంటికి తీసుకెళ్తుండగా తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అర్జిలి యర్రయ్య పట్టుకుని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అప్పగించారు. తరచూ నిర్వాహకులు ఇదే క్రమంలో గుడ్లు, రేషన్, ఇతర సరుకులు ఇళ్లకు తరలించుకుపోతున్నారని, ఇకపై ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు వారిని మందలించి, మరోసారి ఇలా చేస్తే తొలగించి కొత్తవారిని నియమిస్తామని హెచ్చరించారు.

భీమవరం స్కూల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన భీమవరం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

ఎస్.రాయవరం: భీమవరం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు జి.సునీల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వడ్లమూరి నానాజీ, ఉపాధ్యక్షుడిగా కరణం నాగసత్య, మరో 12 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. వీరంతా వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలిచారు. మూడు నెలలు క్రితం జరగాల్సిన ఎన్నిక అధికార పార్టీ ఒత్తిళ్లతో వాయిదా పడింది. ఈ క్రమంలో ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య ఉపాధ్యాయులు ఈ ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలపర్తి వెంకటరమణ, కృష్ణవేగి వెంకటరమణ, భీమరశెట్టి సురేష్, జగదీష్, ఒంటుపల్లి నాగు, రాము, కర్ణం విశ్వనాథం, బాబూజీ, లండా అప్పలరాజు, పోలినాటి సూరిబాబు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.